క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంతోపాటు, మోపాల్ మండలంలోని వివిధ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈలు ఆర్ చంద్రశేఖర్, ప్రసాద్‌రెడ్డి, బాలేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పవర్ హౌస్ కంపౌండ్, అర్సాపల్లి, వినాయక్‌నగర్, మిర్చి కంపౌండ్, గూపన్‌పల్లి, ముబారక్‌నగర్, న్యూ కలెక్టరేట్, తిలక్‌గార్డెన్, మోపాల్ మండలంలోని తాడెం, సిర్‌పూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏడీఈలు కోరారు.

క్రీడా సామగ్రి వితరణ



డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) జెడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రముఖ పారిశ్రామికవేత్త ఏనుగు దయానంద్‌రెడ్డి రూ.50 వేల విలువ గల క్రీడా సామగ్రిని అందించినట్లు హెచ్‌ఎం సంధ్యా నాయక్ శుక్రవారం తెలిపారు. దయానంద్‌రెడ్డి బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ క్రీడా సామగ్రిని అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ విద్యాసాగర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సునీత, సంధ్యారాణి,హేమలత,రత్నకుమారి, వేణుగోపాల్, ఇస్మాయిల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడికి ఆర్థిక చేయూత



సిరికొండ: మండలంలోని పెద్దవాల్గోట్‌లో జుబేర్ అనే వ్యక్తికి తోటి క్లాస్‌మేట్స్ అండగా నిలిచారు. జుబేర్‌కు గ్రామంలో కోళ్ల ఫారం ఉండగా, గత నెలలో కురిసిన భారీ వర్షానికి కోళ్ల ఫారం నేలమట్టమైంది. రూ. 30 లక్షల మేర ఆర్థికంగా నష్టం వాటిల్లింది. దీంతో 2006 ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రులు రూ. 50 వేలను మిత్రుడు జుబేర్‌కు గ్రామంలో శుక్రవారం అందజేశారు. కలత చెందవద్దని అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆయనకు భరోసా ఇచ్చారు. మాజీ సర్పంచ్ గద్దల గంగాదాస్, కానిస్టేబుల్ గోపాల్, పెద్దవాల్గోట్, చిన్నవాల్గోట్, పోతన్నూర్ గ్రామాలకు చెందిన మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

గిరిరాజ్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని గిరిరాజ్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లను ఈ నెల 15, 16వ తేదీల్లో చేపడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 17న అడ్మిషన్ అయిన విద్యార్థుల వివరాలను దోస్తు ప్రక్రియలో నమోదు చేస్తామన్నారు. 18, 19వ తేదీల్లో స్పెషల్ వన్ టైం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని అన్నారు. 20న విద్యార్థుల వివరాలను దోస్తు ప్రక్రియలో నమోదు చేస్తామన్నారు. విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలతో కళాశాలకు హాజరు కావాలని కోరారు.

ధర్పల్లిలో..

ధర్పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 15, 16 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ యస్ జ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి ఉత్తర్వుల మేరకు కళాశాలలో తొలిసారిగా స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. స్పాట్ అడ్మిషన్‌లో సీటు పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అవకాశం ఉండదని ప్రిన్సిపాల్ తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	1,14,500	వెండి(కిలో)	1,34,500
22 క్యారెట్స్	1,05,727	- నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	180
	(కిలోకు)	లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	24	గాజరుగడ్డ	30	60
బెండకాయ	20	40	పచ్చిమిర్చి	40	80
బీరకాయ	40	80	దోసకాయ	20	40
దొండకాయ	40	80	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	70	140	గోబిగడ్డ	15	30
కాకరకాయ	30	60	గోబిపువ్వు	30	60
వంకాయ	30	60	బీట్‌రూట్	30	60
పాలకూర	50	100	కరివేపాకు	40	80
మెంతికూర	60	110	చామగడ్డ	30	60
కొత్తిమీర	40	80	చిక్కుడుకాయ	50	90
పుదీనా	40	80	గోరుచిక్కుడు	50	90
క్యాప్సికం	40	80			

-సుభాష్‌నగర్

'గంబూసియా'తో దోమలు పరార్



మురికికుంటల్లో గంబూసియా చేపలు వదులుతున్న మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్



గంబూసియా చేపలతో శానిటరీ సిబ్బంది

- గంబూసియా చేపపిల్లలతో దోమల వ్యాప్తికి చెక్
- లార్వా దశలోనే నిర్మూలనకు యత్నం
- కుంటల్లో వదిలిన బల్దియా అధికారులు

నిజామాబాద్ సిటీ: గంబుసియా చేపలతో దోమలు పరార్ కానున్నాయి. దోమల వ్యాప్తిని నివారించేందుకు బల్దియా శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకు గానూ గంబుసియా చేపపిల్లల సాయం తీసుకుంటున్నది. ఈ చేపలు దోమలను తినడంతోపాటు వాటి గుడ్లను సైతం ఎదగనివ్వదు. బల్దియా పరిధిలో దోమల వ్యాప్తితో పాటు విష జ్వరాలు విజృంభిస్తున్నందున మున్సిపల్ అధికారులు దోమల నివారణకు గంబుసియా చేపలను 218 ప్యాకెట్లలో ఎస్సారెస్పీ నుంచి తీసుకొచ్చారు. ఒక్కో ప్యాకెట్‌లో 15 వరకు ఉన్నాయి. ఈ చేపలు పది రోజుల్లో 20 చేపలను సంతానోత్పత్తి చేస్తాయి. ఈ చేపలను జిల్లా కేంద్రంలోని మురికి కూపాలు, వర్షపు నీరు నిలిచే ప్రాంతాలు, నీటి కుంటలు, గుంతల్లో వీటిని వదిలేస్తున్నారు. దీంతో అవి దోమలతో పాటు వాటి గుడ్లను సైతం తినేస్తాయి. ఈ చేపలు ఒక్క రోజు 600 దోమ గుడ్లను, లార్వాలను తింటుంది. దీంతో కొత్తవాటి పుట్టుక తగ్గి, దోమల పెరుగుదల నిలిచిపోతుంది.



గంబూసియా చేప

నగరంలోని పలు కాలనీల్లో ఉన్న మురికి కూపాలు, నీటి గుంతల్లో మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ గంబూసియా చేపలను వదిలారు. అంతే కాకుండా కంఠేశ్వర్, గంగస్థాన్-2, మారుతినగర్, ముబారక్‌నగర్, ముస్లింబస్తీ, అహ్మద్‌పుర కాలనీ, అర్సపల్లి వంటి పలు కాలనీల్లోని మురికి గుంతల్లో మున్సిపల్ అధికారులు వీటిని వదిలివేశారు. దీంతో ఈ ప్రాంతాల్లో దోమల నివారణ జరుగుతందని కమిషనర్ దిలీప్‌కుమార్ తెలిపారు. నగరంలోని 5 సర్కిళ్లలో ఆయా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు ఈ గంబూసియా చేపలను మురికినీటిలో వదిలివేశారు.

విష జ్వరాలు వ్యాపిస్తున్నాయి



వర్షాలు కురిసిన ప్రతిసారి దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. శానిటరీ సిబ్బంది చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం లేదు. దీంతో దోమలు విపరీతంగా వ్యాప్తిచెంది విషజ్వరాలు వస్తున్నాయి. చిన్నారులు, వృద్ధులు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. బల్దియా అధికారులు వెంటనే దోమల వ్యాప్తిని అరికట్టాలి.

– న్యాలం రాజు, బీజేపీ మాజీ కార్పొరేటర్, ఎల్లమ్మగుట్ట

గంబూసియాతో దోమలు అంతం



దోమల నివారణకు గంబూసియా చేపలు ఎంతో సహకరిస్తాయి. ఈ చేపటు దోమల ను తినడంతో పాటు వాటి గుడ్ల ను కూడా తినేస్తుంది.బల్దియా పరిధిలోని ప్రజలు దోమ లతో ఇబ్బందులు పడుతున్నందున ఎస్సారెస్పీ నుంచి వీటిని తీసుకొచ్చాం. మురికికుంటల్లో వదిలాం. వీటితో దోమలు వ్యాప్తి చెందకుండా ఉంటాయి.

– నజీర్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్

ఐద్వా ఆధ్వర్యంలో జిల్లా వర్క్‌షాప్

నిజామాబాద్ సిటీ: జిల్లాకేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో ఐద్వా ఆధ్వర్యంలో జిల్లా వర్క్‌షాప్‌ను రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఆశలత అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ముందుగా సీపీఎం అగ్రనాయకుడు దివంగత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వంచిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం మత రాజకీయాలు చేస్తూ ప్రజల్లో ఐక్యతను కోల్పోయే విధంగా చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో బెజుగం సుజాత, అనిత, శారద, కళ, కవిత, రేఖ, యశోద, శ్రీదేవి, లావణ్య, లక్ష్మి, రమాదేవి, మాధవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆశలత

21న అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ



నిజామాబాద్ రూరల్: అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభను ఈ నెల 21న కోటగిరిలో నిర్వహించనున్నట్లు జాతీయ కార్యవర్గ సభ్యుడు పోతుగంటి గంగాధర్ గురుస్వామి శుక్రవారం తెలిపారు. నగరంలోని న్యూటీటీడీ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి ధర్మప్రచార సభ జాతీయ అధ్యక్షుడు అయ్యప్పదాస్ హాజరుకానునట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని భక్తులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూసెట్టి భాస్కర్, జిల్లా అధ్యక్షుడు ధాత్రిక రతన్, దువ్వాడ గురుస్వామి, భాస్కర్,మహేశ్,మురళి,నాగార్జున పాల్గొన్నారు.

గ్రామస్తుల సహకారంతోనే ఈ స్థాయికి..



ముప్ప గంగారెడ్డిని సన్మానిస్తున్న ముదక్‌పల్లి గ్రామస్తులు

- నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి

మోపాల్: ముదక్‌పల్లి గ్రామస్తుల సహకారంతోనే తాను ఏఎంసీ చైర్మన్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడి స్థాయికి ఎదిగానని నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ముదక్‌పల్లిలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ.. ముదక్‌పల్లి సర్పంచ్ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదగడంలో గ్రామస్తుల సహకారం మరువలేనిదన్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని, అందులో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. వీడీసీ అధ్యక్షుడు ఎర సాయిలు, మాజీ సర్పంచ్ కె రాజాకిషన్, పెద్దోళ్ల సాయిరెడ్డి, నాయకులు ఈదుల్ల సాయిలు, సీహెచ్ శ్రీనివాస్, సాయిలు పాల్గొన్నారు.

విద్యతోపాటు నైపుణ్య శిక్షణ అవసరం



నిజామాబాద్‌అర్బన్: విద్యార్థులకు విద్యతో పాటు నైపుణ్య శిక్షణ ఎంతో అవసరమని గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాలలో కాకతీయ సాండ్ బాక్స్, దేశ్ పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగమేళా నిర్వహించారు. 250 మంది ఉద్యోగమేళాలో పాల్గొనగా 112 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది కిరణ్ మృతికి సంతాపం

నిజామాబాద్ సిటీ: జిల్లాకు చెందిన ప్రముఖ న్యాయవాది, తెలంగాణ ఉద్యమకారుడు, మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన పెద్దగాని కిరణ్ కుమార్ గౌడ్ మృతి బాధాకరమని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన కిరణ్ కుమార్‌గౌడ్(55) ఆయన స్వగృహంలో శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన మృతిపై రాజకీయ నాయకులు, ఉద్యమకారులు, కవులు, కళాకారులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

నిజామాబాద్‌అర్బన్: ప్రముఖ న్యాయవాది కిరణ్ కుమార్ గౌడ్ మృతికి మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా శుక్రవారం సంతాపం తెలిపారు. బీ ఆర్ఎస్ పార్టీలో ముఖ్య నాయకుడిగా కొనసాగి న్యాయవాదిగా సేవలందించిన కిరణ్‌కుమార్ మరణించడం తీరని లోటని అన్నారు.

విశ్వం డయాగ్నోస్టిక్ సెంటర్‌లో మమ్మోగ్రఫీ ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ సేవలో అత్యాధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని విశ్వం డయాగ్నోస్టిక్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్ రాస విజయ్ తెలిపారు. శుక్రవారం నగరంలోని విశ్వం డయాగ్నోస్టిక్‌లో సెంటర్‌లో అత్యాధునిక అమ్యులైట్ ఇన్నోవాలిటి ఫుల్ ఫీల్డ్ డిజిటల్ మమ్మోగ్రఫీ(ఎఫ్ఎఫ్ఎం) సేవలను ప్రారంభించారు. హైదరాబాద్ తర్వాత నిజామాబాద్‌లోనే తొలిసారిగా నిర్ధారణ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్న వారు హైదరాబాద్‌కు వెళ్లకుండా తక్కువ ధరల్లో మెరుగైన పరీక్షలు చేయించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఫ్యూజీ ఫిల్మ్ ఇండియా అడ్వైజర్ షున్ సుకే హోండా, డాక్టర్ వివేకానంద, డాక్టర్ అరుణ, డాక్టర్ ముకుంద్, ఆస్పత్రి సిబ్బంది సుదర్శన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మమ్మోగ్రఫీ టెక్నాలజీని ప్రారంభించిన రాసవిజయ్

ఓటరు జాబితా ప్రదర్శన



నిజామాబాద్ రూరల్: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితాను ప్రదర్శించినట్లు ఎంపీడీవో రాంనారాయణ శుక్రవారం తెలిపారు. రూరల్ మండలంలోని తొమ్మిది ఎంపీటీసీ, ఒక జెడ్పీటీసీ స్థానాలకు గాను 40 పోలింగ్‌స్టేషన్లు, 21,992 మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో ఎక్బాల్, సిబ్బంది ఉన్నారు.



నగరంలోని రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, రాష్ట్ర చైర్మన్లు

క్లాత్ షోరూం ప్రారంభం



నిజామాబాద్ రూరల్: ప్రపంచ ప్రఖ్యాత క్లాత్ బ్రాండ్ అయినటువంటి స్నిచ్ షోరూమ్‌ను జిల్లా కేంద్రంలో శుక్రవారం ప్రారంభించినట్లు ప్రముఖ ఆటోమొబైల్ వెంకటేశ్వర గ్రూప్ చైర్మన్ నల్ల మహిపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లా ప్రజలు షోరూమ్‌ను ఆదరించాలని నిర్వాహకులు కోరారు.

సీతారాం ఏచూరి వర్ధంతి



నిజామాబాద్ సిటీ: నగరంలోని నాందేవ్‌వాడలో ఉన్న సీపీఎం కార్యాలయంలో పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి, అగ్రనాయకుడు సీతారాం ఏచూరి వర్ధంతి నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సుజాత, అనిత, సోనీ, సంగీత, నారాయణ పాల్గొన్నారు.

వెంకట్రాంనాయక్ తండాకు వెళ్లేదెలా..!



రోడ్డుపై నుంచి పారుతున్న కొండెం చెరువు అలుగు నీరు



బురదమయంగా మారిన రోడ్డు

- ఒక మార్గం జలమయం.. మరోమార్గం బురదమయం..
- ఇబ్బందుల్లో తండావాసులు
- పట్టించుకోని అధికారులు

మోపాల్: మండలంలోని అమ్రాబాద్ జీపీ పరిధిలోని వెంకట్రాంనాయక్ తండాకు వెళ్లేందుకు సరైన మార్గం లేక తండావాసులు ఇబ్బందులు పడుతున్నారు. తండాకు చేరుకునేందుకు మంచిప్ప నుంచి కొండెం చెరువు మీదుగా, మంచిప్ప నుంచి అమ్రాబాద్ మీదుగా దారి ఉంది. కొండెం చెరువు అలుగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రోడ్డు కోతకు గురైంది. అదేవిధంగా అమ్రాబాద్ మీదుగా వెళ్లే రోడ్డు గతంలో కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. తాత్కాలికంగా మొరం వేసినా.. బురదమయంగా మారింది. తండావాసులు ఆ రోడ్డు గుండా వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఒక మార్గం జలమయం, మరో మార్గం బురదమయం కావడంతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. వెంటనే తండాకు వెళ్లేందుకు రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

యూనివర్సిటీ హాస్టల్స్ సమస్యలు పరిష్కరించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ హాస్టళ్లలో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్, హాస్టల్స్ చీఫ్ వార్డెన్ మామిడాల ప్రవీణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వర్సిటీ ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు సంజీవ్ మాట్లాడుతూ.. క్యాంపస్ హాస్టల్స్‌లో విద్యార్థులు నిత్యం సమస్యలతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. భోజనంలో నాణ్యత లోపించిందని, తాగునీరు, పారిశుద్ధ్యంపై నిర్వహణ లోపం ఉందని విమర్శించారు. హాస్టల్ గదుల్లో ఫ్యాన్లు, లైట్లు మరమ్మతులు లేని కారణంగా రాత్రి వేళల్లో విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చందు, ప్రవీణ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, శిథిలావస్థకు చేరిన సంక్షేమ హాస్టళ్ల స్థానంలో నూతన భవనాలను నిర్మించాలని కోరుతూ అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలు అరకొర వసతులతో నడుస్తున్నాయని, కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, కుషాల్, సుబోద్, టోకు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఇసుక మేటల తొలగింపునకు అంచనాలు

ధర్పల్లి: మండలంలో ముత్యాల చెరువు తెగిపోయి పొలాల్లో వేసిన ఇసుక మేటలను ఉపాధి హామీ పథకంలో తొలగించడానికి అంచనాలను రూపొందిస్తున్నట్లు ఎంపీడీవో లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. వరదతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీరప్ప తండావాసులు ప్రజావాణిలో ఇచ్చిన వినతి మేరకు ఇసుక మేటలను ఉపాధి హామీ సిబ్బందితో కలిసి ఎంపీడీవో శుక్రవారం పరిశీలించారు. భూముల్లో ఎంత మేర ఇసుక మేటలు ఉన్నాయని పొడవు, వెడల్పు, లోతు ఆధారంగా కొలతలు వేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా పంట భూముల్లో ఇసుకను తొలగించి భూమిని చదును చేసి రైతులను ఆదుకుంటామన్నారు. ఏపీవో వినోద, రైతులు ఉన్నారు.



బీరప్ప తండాలో కొలతలను పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మారెడ్డి

మొటాటిరెడ్డి సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

మోపాల్: మోపాల్ మండల మొటాటిరెడ్డి సంక్షేమ సంఘాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గుడి ప్రవీణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మహేశ్‌రెడ్డి, కోశాధికారిగా అంగలి రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ప్రశాంత్‌రెడ్డి, నర్సారెడ్డి, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా గంగారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా గంగారెడ్డి, చిన్నారెడ్డి, సంతోష్‌రెడ్డి, భూపతిరెడ్డి, భూమారెడ్డి, నర్సారెడ్డి, సంతోష్‌రెడ్డి, మహేందర్ ఎన్నికయ్యారు. కమిటీ రెండేళ్లపాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. అన్ని గ్రామాల మొటాటిరెడ్డి సభ్యులను కలుపుకొని సంఘాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. మండల కేంద్రంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. అనంతరం నాయకులు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పెద్దోళ్ల సవీన్ రెడ్డి, మాన్క పృథ్వీరాజ్, అర్కల నారాయణరెడ్డి, అర్కల ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంఘం అధ్యక్షుడికి నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

ఆలయ అభివృద్ధికి సహకరించాలి

- దేవాదాయ శాఖ మంత్రిని కలిసిన పడకల్ గ్రామస్తులు

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్‌కు చెందిన వేంకటేశ్వర ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామంలోని వేంకటేశ్వర ఆలయంలో గుడి గోపుర నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని వారు కోరారు. మంత్రిని శాలువాతో సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు అశోక్, ఆయిల శ్రీనివాస్, పుప్పాల రాజేశ్వర్, కాంగ్రెస్ నాయకులు అంకం ప్రకాశ్, విఠల్, అరుణ్ పాల్గొన్నారు.

